క్లుప్తంగా

నేడు సబ్బవరంలో గడప గడపకు..

సబ్బవరం: సబ్బవరం-1 సచివాలయం పరిధిలో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రమేష్ నాయుడు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి నిర్వహించే ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ గడపగడపకు వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు వివరించడంతో పాటు స్థానిక సమస్యలను తెలుసుకుంటారు. కార్యక్రమానికి మండలంలోని ప్రజా ప్రతినిధులతో పాటు అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

'జగనన్న సురక్ష'పై సమీక్ష


ఉద్యోగులతో సమీక్షిస్తున్న తహసీల్దారు కనకారావు

పరవాడ: మండలంలోని వెన్నలపాలెం, గొర్లివానిపాలెం గ్రామాల్లో మంగళవారం నిర్వహించనున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తహసీల్దారు పి.కనకారావు కోరారు. ఈ కార్యక్రమంలో పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ముఖ్యఅతిథిగా పాల్గొంటారని చెప్పారు. వెన్నలపాలెంలో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లతో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. 11 ఉచిత సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకునే విధంగా వలంటీర్లు, గృహ సారథులు కృషి చేయాలని సూచించారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శి విజయలక్ష్మి, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

నమో శివరుద్రాయ


ఉమాచంద్రమౌళీశ్వర స్వామి

సింహాచలం: అడవివరం దరి విజినిగిరిపాలెంలోని ఉమా చంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో సోమవారం పరమేశ్వరుడికి విశేషంగా అభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించుకుని బిల్వపత్రాలతో పూజలు చేశారు. మహిళలు ఉమాదేవి అమ్మవారికి కుంకుమపూజలు నిర్వహించారు. పలురకాల పుష్పాలతో స్వామిని విశేషంగా అలంకరించారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ ఆధ్వర్యంలో ఈ పూజలు జరిగాయి.

కల్యాణం.. కమనీయం


మాంగల్యధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

బెల్టు షాపుల నిర్వాహకులకు కౌన్సెలింగ్


బెల్ట్ షాపుల నిర్వాహకులకు కౌన్సెలింగ్ ఇస్తున్న తహసీల్దారు శ్యామ్, ఎస్‌ఐ శ్రీనివాసరావు

సింహాచలం: పెందుర్తి మండలంలో గతంలో బెల్ట్ షాపులు నిర్వహించిన వారికి సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. తహసీల్దార్ శ్యామ్ వారికి పలు సూచనలు చేశారు. లా అండ్ ఆర్డర్ ఎస్‌ఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ గతంలో మొత్తం 19మంది అనధికార బెల్ట్ షాపులు నిర్వహించినట్లు గుర్తించామన్నారు. మళ్లీ బెల్టుషాపుల నిర్వహణ చేపడితే సెక్షన్ 109, 110 ప్రకారం రూ.50వేల అపరాధ రుసుం, ఆరు నెలల జైలు శిక్ష ఉంటుందని హెచ్చరించారు.

వలంటీర్లంటే అంత అలుసా?

- పవన్ అనుచిత వ్యాఖ్యలపై ఆగ్రహం
- పెందుర్తి నాలుగు రోడ్ల కూడలిలో ధర్నా



పెందుర్తి నాలుగు రోడ్ల కూడలిలో నిరసన తెలుపుతున్న వలంటీర్లు

సింహాచలం: జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌కు వలంటీర్లంటే అంత అలుసెందుకని పెందుర్తి పరిధిలోని పలు సచివాలయాలకు చెందిన వలంటీర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. పవన్ కల్యాణ్ వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో మహిళల అదృశ్యానికి వలంటీర్లే కారణమంటూ ఏలూరులో పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలపై వారు మండిపడ్డారు. పెందుర్తి నాలుగురోడ్ల కూడలిలో సోమవారం సాయంత్రం ధర్నా చేపట్టారు. పవన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఫ్లెక్సీపై ఉన్న పవన్ చిత్రాన్ని చెప్పులతో కొట్టారు. ఈ సందర్భంగా వలంటీర్లు మాట్లాడుతూ ఇంటి వద్దకే వెళ్లి ప్రజలకు సేవ చేయాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ వలంటీర్ వ్యవస్థను పతిష్టాత్మకంగా ప్రవేశపెట్టారన్నారు. కరోనా సమయంలో కూడా ఇంటింటికీ తిరిగి ప్రజల బాగోగులు చూసిన ఘనత వలంటీర్లదన్నారు. అలాంటి తమను ఉద్దేశించి పవన్ కల్యాణ్ తప్పుగా మాట్లాడటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఆధారాలుంటే చూపించాలని డిమాండ్ చేశారు. వెంటనే పవన్ కల్యాణ్ తన వాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇలాంటి వాఖ్యలు మళ్లీ చేస్తే తగిన బుద్ధి చెబుతామన్నారు. పవన్ కల్యాణ్ సినిమాలను ఆంధ్రప్రదేశ్‌లో విడుదల కాకుండా చేస్తామని హెచ్చరించారు. వెంటనే వలంటీర్లకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

పవన్ క్షమాపణ చెప్పాలి



ప్రజలకు సేవ చేయడానికి వలంటీర్ వ్యవస్థను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తీసుకొచ్చారు. సేవా దృక్పథంతో వలంటీర్లమంతా ఇంటింటికీ వెళ్లి ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడంలో మావంతు పాత్ర పోషిస్తున్నాం. పార్టీలకతీతంగా పనిచేస్తున్నాం. పవన్ కల్యాణ్ మాపట్ల అంత చులకన భావంతో మాట్లాడడం చాలా బాధాకరం. ఆయన వలంటీర్లకు క్షమాపణ చెప్పాలి.

–అచ్చియ్యమ్మ, వలంటీర్, 516 సచివాలయం, పెందుర్తి

కరోనాలో ఎంతో సేవ చేశాం



వలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చిన గొప్ప ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. కరోనా కష్టకాలంలో కూడా ఆయన ఆదేశాలతో ప్రాణాలను కూడా లెక్క చేయకుండా సేవలందించాం. అలాంటి వలంటీర్లపై పవన్ కల్యాణ్ నీచంగా మాట్లాడారు. ప్యాకేజీలకు అమ్ముడుపోయిన పవన్ కల్యాణ్ అసలు ఏమి మాట్లాడుతున్నారో అతనికే తెలియని పరిస్థితి నెలకుంది. పవన్ కల్యాణ్ వెంటనే తన మాటలు వెనక్కితీసుకోవాలి. లేదంటే వలంటీర్ల ఆగ్రహావేశాలకు కొట్టుకుపోతారు.

– సంతోషి కుమారి, 500 సచివాలయం, 95వవార్డు చీమలాపల్లి

స్వచ్ఛతలో టార్గెట్ నంబర్-1

జెడ్సీ మల్లయ్యనాయుడు


ఇందిరానగర్‌లో అవగాహన కల్పిస్తున్న జెడ్సీ మల్లయ్యనాయుడు

గోపాలపట్నం: స్వచ్ఛ సర్వేక్షణ్‌లో విశాఖను మొదటి స్థానంలో నిలపాలని జోన్-8 జోనల్ కమిషనర్ మల్లయ్యనాయుడు పిలుపునిచ్చారు. జీవీఎంసీ 92వ వార్డు ఇందిరానగర్‌లో సోమవారం స్వచ్ఛ సర్వేక్షణ్‌పై సోమవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సిటిజన్ ఫీడ్‌బ్యాక్ తీసుకోవాలని సూచించారు. ప్రతీ వలంటీర్ ఆయా ప్రాంతాల ప్రజలతో ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేయించి ఫీడ్ బ్యాక్ చేయించాలన్నారు. విశాఖనగరాన్ని మొదటి స్థానంలో నిలబెట్టడానికి అంతా సమష్టిగా కృషి చేయాలని సూచించారు. ప్రజల కూడా సహకరించి నగరానికి మొదటి ర్యాంకు సాధనలో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎస్ రమణ, శానిటరీ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సబ్బవరం: మండలంలోని 11 కేవీ సబ్బవరం రూరల్ ఫీడర్‌లో విద్యుత్ లైన్ల నిర్వహణలో భాగంగా బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్. రామకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.దీనితో మండలంలోని ఇరువాడ,అసకపల్లి,పైడివాడ అగ్రహారం,పెదగొల్లలపాలెం,తవ్వవానిపాలెం,అమృతపురం,గాలిభీమవరం గ్రామాల్లో బుధవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1వరకూ విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. విద్యుత్ వినియోగదారులంతా సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కార్పొరేటర్ ముమ్మన దేముడు

సింహాచలం: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని 95వవార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు అన్నారు. వార్డు పరిధిలోని పురుషోత్తపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సోమవారం ఆయన సందర్శించారు. మధ్యాహ్న భోజనం పథకం అమలు తీరును పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం జగనన్న గోరుముద్దను ప్రవేశపెట్టిందన్నారు. విద్యార్థులకు రాగి జావ, నాణ్యమైన పోషకాలున్న ఆహారం అరించడం జరుగుతోందన్నారు. విద్యతో పాటు మధ్యాహ్న భోజనం నాణ్యంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని పాఠశాల ప్రదానోపాధ్యాయుడు దేవుళ్లకు సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు శ్రీనివాస్,వైఎస్సార్‌సీపీ నాయకులు జె. సాయికృష్ణ, బొడ్డు దేముడు బాబు, చెతన్య యాదవ్ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల తొలగింపు


సబ్బవరం రెవెన్యూ పరిధిలో ఆక్రమణలను తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది

సబ్బవరం: సబ్బవరం రెవెన్యూ పరిధి సర్వే నెం.286 రెల్లి కాలనీ వద్ద చేపడుతున్న అక్రమ నిర్మాణాలను తహసీల్దార్ బి.సత్యనారాయణ ఆదేశాల మేరకు ఆర్ఐ వీరయ్య ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది సోమవారం పొక్లెయిన్ సాయంతో తొలగించారు. ఈ సందర్భంగా ఆర్ఐ మాట్లాడుతూ రెల్లి కాలనీ వద్ద గతంలో కొంతమంది రెల్లి కులస్తులకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలు మంజూరు చేసినట్టు తెలిపారు. సదరు ఇళ్ల స్థలాలను కొందరు ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారని, లబ్ధిదారుల ఫిర్యాదు మేరకు చర్యలు తీసుకున్నట్టు పేర్కొన్నారు. ఆక్రమణలను తొలగించి పట్టాదారులైన లబ్ధిదారులకు ఆ స్థలాలను అప్పగించామన్నారు. తొలగింపు పనుల్లో వీఆర్వో నూకరత్నం, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల సహకారంతోనే పర్యావరణ పరిరక్షణ


ఆర్టీసీ బస్సులో జీవీఎంసీకి చేరుకుంటున్న మేయర్ హరి వెంకటకుమారి

డాబాగార్డెన్స్: విశాఖలో పర్యావరణ పరిరక్షణకు అందరి సహకారం అవసరమని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అన్నారు. కాలుష్య నియంత్రణలో భాగంగా మేయర్ క్యాంప్ కార్యాలయం నుంచి ఆర్టీసీ బస్సులో ప్రయాణించి జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి చేరుకున్నారు. అనంతరం మేయర్ డయల్ యువర్ మేయర్, జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ విశాఖ నగరంలో కాలుష్యం విపరీతంగా పెరిగిపోతున్న దృష్ట్యా, పర్యావరణ పరిరక్షణకు అందరూ కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల ఉద్యోగులు, నగర ప్రజలు, వ్యాపార సంస్థలు, విద్యా సంస్థల యాజమాన్యాలు కాలుష్య నియంత్రణకు సహకరించి, వారంలో ఒక రోజు ప్రజారవాణాను ఉపయోగించాలని కోరారు. ప్రతీ సోమవారం జీవీఎంసీ ఉద్యోగులు ప్రజారవాణా వ్యవస్థను ఉపయోగిస్తున్నారన్నారు.

పోర్టు కార్మికులకు కనీస వేతనం రూ.36 వేలు ఇవ్వాలి

పెదగంట్యాడ: అదానీ గంగవరం పోర్టులో కార్మికులకు కనీస వేతనం 36వేలు ఇవ్వాలని ఏఐటీయూసీ జాతీయ కార్యదర్శి రామకృష్ణ పాండా అన్నారు. గంగవరం పోర్టు ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో పోర్టు వంతెన వద్ద గల స్టీల్ ప్లాంట్ ఆస్పత్రి వద్ద చేపట్టిన నిరవధిక నిరసన దీక్ష శిబిరాన్ని సోమవారం ఆయన సందర్శించారు. కార్మికుల పోరాటానికి మద్దతు తెలిపారు. ఆయన మాట్లాడుతూ కార్మికులకు వెంటనే జీతాలు పెంచాలని, తొలగించిన వారిని మళ్లీ విధుల్లోకి తీసుకోవాలన్నారు. 29 మంది కార్మికులపై విధించిన ఆంక్షలను ఎత్తి వేయాలన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ అనుచరుడైన ఆదాని గంగవరం పోర్టు టేకోవర్ చేసుకున్నప్పటి నుంచి కార్మికుల పరిస్థితి మరి అధ్వానంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు, ఐఎన్‌టీయూసీ నాయకుడు మంత్రి రాజశేఖర్, నాయకులు ఆదినారాయణ, కొవిరి అప్పలరాజు, డీవీ రమణ, కసిరెడ్డి సత్యనారాయణ, జె.రామకృష్ణ తదితరులు కార్మికులకు మద్దతు తెలిపారు.

ఎన్నికల నిర్వహణ సంక్లిష్టమైన ప్రక్రియ

- ఓటు హక్కు వినియోగించుకునే దిశగా చైతన్యం అవసరం
- ఏయూ జర్నలిజం విభాగాధిపతి ఆచార్య మూర్తి


ప్రసంగిస్తున్న ఆచార్య డి.వి.ఆర్.మూర్తి


ఏయూ క్యాంపస్: సార్వత్రిక ఎన్నికల నిర్వహణ ఎంతో సంక్లిష్టమైన ప్రక్రియ అని ఏయూ జర్నలిజం విభాగాధిపతి ఆచార్య డి.వి.ఆర్.మూర్తి అన్నారు. సోమవారం ఉదయం ఏయూ రాజనీతిశాస్త్ర విభాగం సమావేశ మందిరంలో నిర్వహించిన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ వ్యవస్థాపక దినోత్సవంలో భాగంగా భారతదేశంలో ఎన్నికల నిర్వహణ అనే అంశంపై ఆయన మాట్లాడారు. ఓటు హక్కును పూర్తిస్థాయిలో అందరూ వినియోగించుకునే దిశగా ప్రజలను చైతన్యం చేయాల్సిన అవసరం ఉందన్నారు. 1971లో దేశంలో ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన సందర్భంలో 17 కోట్ల మందికి ఓటు హక్కు ఉండేదని, నేడు 90 కోట్ల మందికిపైగా ప్రజలకు ఓటు హక్కు ఉందన్నారు. అయితే ఎన్నికల్లో 70 శాతం మంది వరకు మాత్రమే ఓటు హక్కును వినియోగించుకుంటున్నారన్నారు. దేశంలో ఎన్నికల నిర్వహణ సమయంలో ప్రభుత్వం ఒక్కో ఓటుకు సగటున రూ.72 ఖర్చు చేయాల్సిన అవసరం ఏర్పడుతోందన్నారు. 1951లో ఒక్కో ఓటుకు 60 పైసలు ఖర్చు అయ్యేదని తెలిపారు. 1957లో బ్యాలెట్ బాక్సుల ఏర్పాటు, ఓటు వేసినందుకు గుర్తుగా సిరా గుర్తు వేయడం, ఎన్నికల గుర్తుల కేటాయింపు తదితర అంశాలను వివరించారు. ఎన్నికల సంఘానికి ఎన్నికల సమయంలో ఎదురవుతున్న వివిధ సవాళ్లపై అవగాహన కల్పించారు. భారత్‌లో ఈవీఎంల వినియోగం, వీటిపై న్యాయస్థానాలలో వ్యాజ్యాలు వేయడం తదితర అంశాలను తెలియజేశారు. ఎన్నికల సమయంలో పెయిడ్ న్యూస్ అనేది పెద్ద సవాలుగా మారుతోందన్నారు. 2009లో ఆంధ్రప్రదేశ్‌లో దాదాపు రూ.350 కోట్ల వరకు పెయిడ్ న్యూస్ రూపంలో ఖర్చు చేసినట్లు గణాంకాలు చెబుతున్నాయన్నారు.

ఐఐపీఏ విశాఖ ప్రాంతీయ శాఖ చైర్మన్ ఆచార్య ఆర్.సుదర్శనరావు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు దాదాపు రూ.65 వేల కోట్లు ఖర్చు అవుతుందని, ఇది ఒక రాష్ట్ర ఏడాది బడ్జెట్‌తో సమానమన్నారు. ఈ కార్యక్రమంలో ఐఐపీఏ ఉపాధ్యక్షుడు ఆచార్య ఎస్.సాంబశివరావు, కార్యదర్శి పి.ప్రేమానందం, పూర్వ చైర్మన్ ఆచార్య ఇ.ఎ.నారాయణ, సంయుక్త కార్యదర్శి డాక్టర్ సవిత, తదితరులు పాల్గొన్నారు.

13న కాంట్రాక్ట్ కార్మిక సంఘాల ధర్నా

ఉక్కునగరం: కార్మికులకు ఎస్.ఎం.ఎ, ఎ.ఎస్.ఎం.ఎ, ఐఆర్ చెల్లించాలని, కాంట్రాక్ట్ కార్మికులకు హెల్త్ కార్డులు ఇవ్వాలని, బోనస్‌ను చెల్లించాలనే డిమాండ్‌తో స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మిక సంఘాలు ఈ నెల 13న ధర్నా చేపట్టనున్నాయి. ఈ మేరకు ధర్నా పోస్టర్‌ను ఎల్‌ఎంఎం పార్కులో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో అఖిలపక్ష కాంట్రాక్టు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో నమ్మి రమణ, మంత్రి రవి, బొడ్డు గోవింద, సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

'కేంద్ర ప్రభుత్వం దిగిరాక తప్పదు'


దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకుడు

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట కార్మికులు తమ జీవితాల కోసం చేస్తున్న పోరాటానికి కేంద్రప్రభుత్వం దిగి రాక తప్పదని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ అంశంలో నిర్ణయం మార్చుకోవాల్సిందేనని అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెంలో చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి 879వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో పలువురు కార్మికులు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను కార్మికులంతా ఐక్యంగా ఎదుర్కొంటామన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో సత్వర న్యాయం

- జేసీఎస్ మండల ఇన్‌చార్జి నక్క కనకరాజు
- 1650 సర్టిఫికెట్ల అందజేతతో జిల్లాలో గుర్రంపాలెం ప్రథమస్థానం


పాల్గొన్న గ్రామస్తులు, లబ్ధిదారులు


జగనన్న సురక్షలో అర్హులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న నక్క కనకరాజు తదితరులు

సింహాచలం: అర్హులైనవారందరికీ ప్రభుత్వ పథకాలు, 11 రకాల సర్టిఫికెట్లు అందజేయడమే జగనన్న సురక్ష కార్యక్రమం లక్ష్యమని వైఎస్సార్‌సీపీ పెందుర్తి మండల అధ్యక్షుడు, మండల జేసీఎస్ ఇన్‌చార్జి నక్క కనకరాజు అన్నారు. పెందుర్తి మండలం గుర్రంపాలెంలో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కనకరాజు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు సాంకేతిక కారణాల వల్ల అందుకోలేనివారిని గుర్తించడానికి ఉపయోగదాయకంగా ఉంటుందన్నారు. ఇప్పటికే గ్రామంలో ఇంటింటికీ సచివాలయ సిబ్బంది తిరిగి 11 రకాల ధ్రువపత్రాల కోసం దరఖాస్తులు సేకరించారన్నారు. 1650 మందికి పత్రాలు అందించారు.1650 పత్రాల పంపిణీతో గుర్రంపాలెం జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ శోభారాణి, జెడ్పీటీసీ ఉప్పిలి దేవి, ఎంపీపీ నాగమణి, అప్పారావు, ఆర్ఐ సాయిబాబా, ఎంపీటీసీ శివ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు సారిపల్లి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

త్రిఫ్ట్ సొసైటీ ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీ విజయం


సొసైటీ ఎన్నికల్లో విజయం సాధించిన ఐఎన్‌టీయూసీ డైరెక్టర్లు

సింధియా: హిందూస్థాన్ షిప్‌యార్డ్ వర్కర్స్ కో ఆపరేటివ్ థ్రిఫ్ట్ – క్రెడిట్ సొసైటీ ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీ అభ్యర్థులు విజయఢంకా మోగించారు. దీంతో ఐఎన్‌టీయూ నాయకులు సోమవారం పరిశ్రమ ఆవరణలో పెద్ద ఎత్తున సంబరాలు చేశారు. సోమవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహించారు. మొత్తం సొసైటీ సభ్యులు 294 మంది ఉండగా, 289 ఓట్లు పోలయ్యాయి. సొసైటీని 9 జోన్లుగా విభజించిన అధికారులు ప్రతి జోన్‌లోనూ సొసైటీలో ఉన్న 294 మంది పాల్గొనెలా చర్యలు తీసుకున్నారు. 9 జోన్లకు పోటీపడిన ఐఎన్‌టీయూసీ అభ్యర్థులు అత్యధిక మెజారిటీతో గెలుపొందారు. సొసైటీపై ఉన్న అవగాహన, కార్మికుల పక్షాన చేసిన పోరాటాలే తమను గెలిపించాయని ఐఎన్‌టీయూసీ నాయకులు చెప్పారు.

ప్రతి గ్రామంలో ధార్మిక జట్టు ఏర్పాటు


సమావేశంలో మాట్లాడుతున్న అప్పలనాయుడు

సబ్బవరం: ప్రతి గ్రామంలో ధార్మిక జట్టు ఏర్పాటు చేయాలని సమరసత సేవా ఫౌండేషన్ పరవాడ సబ్ డివిజన్ ధర్మప్రచారక్ వెన్నల అప్పలనాయుడు అన్నారు. సబ్బవరంలోని శ్రీ దుర్గాదేవి ఆలయంలో సోమవారం సమరసత సేవా ఫౌండేషన్ మండల సమావేశం నిర్వహించారు. సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న అప్పలనాయుడు మాట్లాడుతూ గ్రామంలో దేవాలయాలు శక్తి కేంద్రాలుగా మారాలన్నారు. దేవాలయం కేంద్రంగా వైద్యం.. తీర్పు చెప్పే విధంగా ప్రజల్లో మార్పు తీసుకురావడానికి ప్రయత్నం చేయాలని సూచించారు. వారంవారం భజన, ప్రతీ పౌర్ణమికి ప్రజలందరూ కలిసి సామూహిక హారతి నిర్వహించాలన్నారు. కులపెద్దలు, ధార్మిక పెద్దలు కలిసి హిందూ ధర్మాన్ని మరింత ముందుకు తీసుకువెళ్లేలా కార్యకర్తలను తయారు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మాతృమూర్తులు మండల మహిళా కన్వీనర్ రవణమ్మ, పి. వరలక్ష్మి, కన్వీనర్ అనకాపల్లి వెంకటరమణ, సహకన్వీనర్ దాసరి రాము, ధార త్రిమూర్తులు, పెద్దపల్లి శంకర్, దాడి లక్ష్మణరావు పాల్గొన్నారు.

జీఎస్‌టీపై పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాద రెడ్డి

ఏయూ క్యాంపస్: సేవల పన్ను(జీఎస్‌టీ)పై రచించిన ద్విభాషా పుస్తకాన్ని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి సోమవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. బీకాం ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ఉపయుక్తంగా ఏయూ అకడమిక్ డీన్ ఆచార్య ఎస్.కిషోర్‌బాబు ఎడిటర్‌గా, డాక్టర్ వీఎస్ కృష్ణా కళాశాల అధ్యాపకులు డాక్టర్ గుడిపాటి శ్రీనివాసరావు, డాక్టర్ జి.అరుణ్‌కుమార్, డాక్టర్ కె.శ్రీనివాసరావు, డాక్టర్ ఎం.శ్యాంబాబు, హెచ్.ఎస్.ఎన్.వి.ఎస్.పవన్‌కుమార్ సహ రచయితలుగా ఈ పుస్తకాన్ని తీర్చిదిద్దారు. విద్యార్థులకు అర్థమయ్యే విధానంలో ఆంగ్లం, తెలుగు భాల్లో ఈ పుస్తకాన్ని తీసుకొచ్చినట్టు రచయితలు తెలిపారు. సులభంగా వస్తు, సేవల పన్నులకు సంబంధించిన పాఠ్యాంశాలను దీనిలో పొందుపరిచామన్నారు. ఈ సందర్భంగా పుస్తక రచయితలను వీసీ ప్రసాదరెడ్డి అభినందించారు.

యోగాతో శరీరం, మనస్సు అనుసంధానం


మాట్లాడుతున్న రిజిస్ట్రార్ వి.కృష్ణమోహన్

ఏయూ క్యాంపస్: మానవ శరీరం, మనస్సును అనుసంధానం చేసేదిగా యోగా నిలుస్తుందని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ అన్నారు. ఏయూ యోగా విలేజ్‌లో జరుగుతున్న 'అనుష్టాన యోగ వేదాంత ఫర్ హోలిస్టిక్ లివింగ్'రెండు రోజుల సదస్సు ముగింపు కార్యక్రమం సోమవారం జరిగింది. యోగాచార్య డాక్టర్ రాపర్తి రామారావు శతజయంతి ఉత్సవాలలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ భారతీయ మూలాలు కలిగిన యోగా నేడు విశ్వవ్యాప్తంగా విస్తరించిందన్నారు. సాత్విక లక్షణాలను పెంపొదించే ఆహారాన్ని స్వీకరించడం ఎంతో ప్రధానమన్నారు. యోగా కాన్షియస్‌నెస్ ట్రస్ట్ వ్యవస్థాపక ట్రస్టీ ఆచార్య పి.రవీంద్రనాథ్, ఆర్వీ ఆర్ ప్రాజెక్ట్స్ చైర్మన్ ఆర్.వెంకటేశ్వరరావు, యోగా విభాగాధిపతి ఆచార్య కె.రమేష్‌బాబు, డాక్టర్ ఆర్.తులసిరావు, డి.వెంకటరావు, డి.సాయి కృష్ణ, డాక్టర్ సునీత, నాగిరెడ్డి, డాక్టర్ సి.శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వం.. మండలాభిషేక మహోత్సవం


కలశ పూజల్లో పాల్గొన్న బాలాజీ దంపతులు

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణంలో నిర్మించిన శ్రీ తిరుమల బాలాజీ మందిరంలో మండలాభిషేక మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. సోమవారం వేకువజాము నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. 108 కలశాలను ఏర్పాటు చేసి విశేష పూజలు చేశారు. ఎస్టీబీఎల్ అధినేత గుత్తికొండ బాలాజీ దంపతులు కలశపూజలో పాల్గొన్నారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, అగ్నిధ్యానం, కుంభారాధన అష్టోత్తర శతకలశ స్నపనం (108 కలశాలతో స్వామి వారికి అభిషేకం), విశేష మూలమంత్ర హోమం చేసి మహా పూర్ణాహుతి సమర్పించారు. బాలాజీని పంచామృతాలతో అభిషేకించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి కుటుంబసమేతంగా స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఎస్టీబీఎల్ జీఎం జి.వి.కృష్ణయ్య, జీవన్‌బాబు, జి.గంగా మహేష్, గాంధీ, శ్రీ తిరుమల బాలాజీ ట్రస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.